క్లుప్తంగా

ముగిసిన యోగా శిక్షణ తరగతులు


యోగాసనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని భరతమాత గుడి వీధిలోని యోగా చైతన్య కేంద్రంలో పది రోజులుగా నిర్వహిస్తున్న వ్యక్తిత్వ వికాస యోగా శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. యోగా గురువు దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు రెసిడెన్షియల్ వ్యక్తిత్వ వికాస యోగా శిక్షణ ఇచ్చామని చెప్పారు. యోగా, ప్రాణాయామం, భగవద్గీత, శ్లోకాలు, ఆధ్యాత్మిక విషయాలపై అవగాహన కల్పించడమే కాకుండా తర్ఫీదునిచ్చామని చెప్పారు. ప్రశంస పత్రం అందజేసిన అనంతరం విద్యార్థులు యోగాసనాలను ప్రదర్శించారు. భవనాశి వాసు, మహేష్, మహేశ్వరరెడ్డి, శాంతిరాజు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు


ట్రోఫీ అందుకుంటున్న నంద్యాల సొసైటీ సహకార బ్యాంక్ యూనియన్ ఉద్యోగులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నంద్యాల జిల్లా సహకార సంఘం ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీల్లో వెలుగోడు, ఆత్మకూరు, శిరివెళ్ల, కోవెలకుంట్ల, నంద్యాల, ఆళ్లగడ్డ సొసైటీల జట్లు పాల్గొన్నారు. విజేతగా నంద్యాల టీం గెలుపొంది రూ.15వేలు దక్కించుకుంది. రన్నరప్‌గా వెలుగోడు టీం రూ.10వేలు దక్కించుకోగా మూడో స్థానంలో కోవెలకుంట్ల సొసైటీ టీం నిలిచి రూ.5వేలు అందుకుంది. మేనేజర్‌లు మధుబాబు, నారాయణరెడ్డి, అమర్‌నాథరెడ్డి బహుమతులు అందజేశారు.

మోటార్ సైకిళ్లు ఢీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు

రుద్రవరం: మండలంలోని ఆలమూరు పాత సినిమా హాల్ సమీపంలో ఆదివారం రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ముగ్గురు తీవ్ర గాయాల పాలయ్యారు. ఆళ్లగడ్డ మండలం యాదవాడకు చెందిన వెంకటరాముడు, ఆదాము ఒక మోటార్ సైకిల్‌పై ఆలమూరు వైపు, నర్సాపురానికి చెందిన రామసుబ్బారెడ్డి మరో మోటార్ సైకిల్‌పై చాగలమర్రి వైపు వెళ్తుండగా ప్రమాద వశాత్తు రెండు మోటర్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ప్రమాదంలో రెండు మోటర్ సైకిళ్లపై ఉన్న ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళ్తున్న వారు క్షత గాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే వారిలో ఆదాము, రామసుబ్బారెడ్డిని మెరుగైన చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విద్యార్థులకు ప్రోత్సాహం



బహుమతులు అందుకున్న విద్యార్థులు

నంద్యాల(వ్యవసాయం): పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఉప్పరి సంఘానికి చెందిన విద్యార్థులకు పట్టణ ఉప్పరి సంఘం ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శివయ్య ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సుంకులమ్మ గుడి ఆవరణలో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

అనురాగానికి మరో రూపం అమ్మ

నంద్యాల(అర్బన్): అనురాగానికి మరో రూపం అమ్మ అని ప్రేమ, వాత్సల్యానికి నిలువెత్తు నిదర్శనమని నీడ్ ఫర్ హెల్ప్ సొసైటీ సభ్యురాలు వసుమతి, భాగ్యశ్రీ తెలిపారు. బాలాజీ కాంప్లెక్స్‌లో ఆదివారం మాతృదినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఆటలు, పాటల పోటీల్లో గెలుపొందిన తల్లులకు కల్యాణి బహుమతులు అందజేశారు.

కొలనుభారతిలో ప్రత్యేక పూజలు


చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: సరస్వతీ క్షేత్రమైన కొలనుభారతిలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పురోహితులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కలిగించి, విశేష పూజాకార్యక్రమాలు చేపట్టారు. సుమారు 24 మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు.

కలల దారి..నెరవేరి

ఊరికి తొలిసారిగా దారి..

ఈ ఫొటోలో ఉన్న రోడ్డు దొర్నిపాడు నుంచి వెంకటేశ్వరనగరం వెళ్లే దారి. గ్రామం పుట్టినప్పటి నుంచి ఇలా కంకర తేలిన దారిలో వెళ్లే వారు. గ్రామస్తుల అగచాట్లను గుర్తించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.2 కోట్లతో నాలుగు కి.మీ. మేర బీటీ రోడ్డును తొలిసారిగా నిర్మించారు. ఆరు దశాబ్దాల కల సాకారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమకు ప్రయాణ కష్టాలు తప్పాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


నాడు.. దొర్నిపాడు నుంచి వెంకటేశ్వరనగర్‌కు వెళ్లే దారి


నేడు.. నూతన బీటీ రోడ్డు నిర్మించిన దృశ్యం

కంకర రోడ్డులో కష్టాల పయనం

ఇక్కడ కంకర తేలి కనీసం నడవడానికి కూడా కష్టంగా కనిపిస్తున్న రోడ్డు కొండాపురం నుంచి ఆళ్లగడ్డ మండలంలోని పేరాయిపల్లె మెట్ట వరకు పోతుంది. ఈ గ్రామస్తులు కంకర రోడ్డులో ఇన్నాళ్లు అవస్థలకోర్చి ప్రయాణం సాగించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రకు సంఘీభావంగా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఈ దారిన పాదయాత్ర చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు వేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఇంకే ముంది. 3.50 కి.మీ. మేర రూ.90 లక్షలు వెచ్చించి నూతన బీటీ రోడ్డును నిర్మించారు. ఈ దారి నిర్మించడం పట్ల దొర్నిపాడు, బుర్రారెడ్డిపల్లె, భాగ్యనగరం, రామచంద్రాపురం, అమ్మిరెడ్డినగరం, చాకరాజువేముల గ్రామస్తులు నంద్యాలకు వెళ్లేందుకు 15 కి.మీ. దూరం తగ్గింది.


నాడు కొండాపురం నుంచి పేరాయిపల్లెకు వెళ్లే దారి


నేడు.. బీటీ రోడ్డు వేసిన దృశ్యం

ఉమ్మడి జిల్లాలో మారుమూల మండలం దొర్నిపాడు. దీంతో అభివృద్ధికి దూరంగా నిలిచిపోయింది. ముఖ్యంగా రహదారులు సరిగా లేకపోడంతో ఆయా గ్రామాల ప్రజలు బయటకు రావాలంటే అష్టకష్టాలు పడాల్సి వచ్చేది. దీంతో కాలువల గట్ల వెంట ప్రయాణించేవారు. ఇక పంట దిగుబడులు చేతికొచ్చిన సమయంలో వారి అవస్థలు వర్ణనాతీతం. పంట పండిందనే సంతోషం కన్నా.. వాటిని ఇంటికి చేర్చడానికి పడే కష్టం అధికంగా ఉండేది. రోడ్లు వేయాలని పలు గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ఇలా అరవై ఏళ్లు గడిచిపోయాయి. అయితే.. ప్రజాప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి వారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపింది.

- రూ.4 కోట్లతో సీసీ రోడ్లు
- రూ.2.90 కోట్లతో గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణం
- ఏళ్ల నిరీక్షణకు దారి చూపిన ప్రభుత్వం

దొర్నిపాడు: ఎన్నో ప్రభుత్వాలు మారాయి..ఎందరో నాయకులు వచ్చి పోయారు..కానీ ఆ గ్రామాలు పుట్టినప్పటి నుంచి దారుల రూపు రేఖలు మారలేదు. దశాబ్దాలు గడుస్తున్నా అవస్థల పయనం తప్పలేదు. ప్రజా ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక నూతన రహదారులు నిర్మించారు. కొండాపురం–పేరాయిపల్లె మెట్ట, దొర్నిపాడు– వెంకటేశ్వరనగరం గ్రామాల్లో తొలిసారిగా బీటీ రోడ్లను నిర్మించారు. అలాగే భాగ్యనగరం, కొండాపురం, దొర్నిపాడులోని పధాన రహదారిలో సీసీ రోడ్లను నిర్మించారు. జగనన్న ప్రభుత్వం దీర్ఘకాలిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపింది.

రూ.నాలుగు కోట్లతో..

మండల కేంద్రం దొర్నిపాడు, కొండాపురం, భాగ్యనగరంలోని ప్రధాన రహదారిని బీటీ రోడ్డుగా వేశారు. చిన్న పాటి వర్షాలకు రోడ్డు గుంతలమయం కావడంతో రోడ్డంతా కుంటలా కనిపించేంది. దీంతో ఆయా గ్రామాలను దాటేందుకు వాహనదారులు నానా అగచాట్లు పడేవారు. ఈ మూడు గ్రామాల్లో రూ.4కోట్లతో రెండు కి.మీ. మేర సీసీ రోడ్డు నిర్మాణం ఇటీవల పూర్తి చేశారు. దీంతో నిర్లక్ష్యానికి గురైన గ్రామాలను అభివృద్ధి బాట పట్టిస్తామని చెప్పినట్లయ్యింది. రోడ్డు పూర్తవడంతో ప్రస్తుతం రాకపోకలు సులభతరమయ్యాయని పేర్కొంటున్నారు.


నాడు..కొండాపురంలో అధ్వానంగా బీటీ రోడ్డు.


నేడు.. సీసీ రోడ్డు నిర్మించిచడంతో తీరిన అగచాట్లు

దారిలేక ఎన్నో అవస్థలు పడ్డాము



మా ఊరికి దారిలేక ఎన్నో అవస్థలు పడ్డాము. గ్రామం పుట్టి 60 ఏళ్లు గడుస్తున్నా రోడ్డు వేయడానికి అధికారులు, ప్రభుత్వాలు పట్టించుకోలేదు. దీంతో కేసీ కెనాల్ గట్టు వెంబడి రాకపోకలు సాగించాము. పొలాల్లోని ధాన్యం ఇంటికి తెచ్చుకోవాలంటే మా అగచాట్లు ఆ దేవుడికే తెలుసు. ఇన్నేళ్ల సమస్యకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నూతన రహదారి నిర్మించి పరిష్కారం చూపింది. మాకు ఇప్పుడు ప్రయాణ కష్టాలు తప్పాయి.

–నాగేశ్వరరావు, వెంకటేశ్వరనగరం

ఏ ప్రభుత్వం ఇంత వరకు పట్టించుకోలేదు



దారులు బాగుచేయాలని ఎన్నో ప్రభుత్వాలను, నాయకులను అభ్యర్థించాం. కానీ ఏ ఒక్కరూ మా మొర వినలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక.. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. వారి చొరవతో కొడాపురం–పేరాయిపల్లె రోడ్డు, అలాగే భాగ్యనగరం, కొండాపురం, దొర్నిపాడు గ్రామాల్లోని ప్రధాన రహదారిలో సీసీ రోడ్డు వేయించారు. ప్రస్తుతం ప్రయాణం సురక్షితంగా సాగుతోంది.

– మాధవీలత, సర్పంచ్, కొండాపురం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆళ్లగడ్డ, రుద్రవరంలో నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఆళ్లగడ్డ: మండల కేంద్రం చాగలమర్రి ఆర్సీఎం ఉన్నత పాఠశాలలో ఆదివారం 2003–04లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఉల్లాసంగా గడిపారు.

రుద్రవరం: ఒకే బడిలో కలిసి చదువుకున్న వారు మళ్లీ 30 ఏళ్ల తరువాత అదే పాఠశాలలో కలిసి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని, సంతోషంగా, ఉల్లాసంగా గడిపారు. స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–93 బ్యాచ్‌లో దాదాపు వంద మంది విద్యార్థులు పదో తరగతి చదివారు. నాటి నుంచి వారు ఎవరి దారిలో వారు స్థిరపడ్డారు. వారిలో ఉపాధ్యాయులు, మునిసిపల్ కమిషనర్, కాంట్రాక్ట్ ఉద్యోగులుగా జీవనం సాగిస్తున్నారు. వారంతా ఆదివారం నాడు చదివిన పాఠశాలలో ఆత్మీయంగా కలుసుకున్నారు. ముందుగా పాఠశాలను ప్రత్యేకంగా అలంకరించి, నాటి గురువులను సన్మానించి వారి ఆశీస్సులు పొందారు. చదివిన పాఠశాలకు చేయూతనిద్దామని, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తోటి మిత్రులను ఆదుకోవాలని తీర్మాణించుకున్నారు.




ఆర్.పాంపల్లెలో గంగమ్మకు పూజలు చేస్తున్న భక్తులు,భక్తులకు గంగా, కాటమరాజు కథ వినిపిస్తున్న దృశ్యం,ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీని సన్మానిస్తున్న గ్రామస్తులు

వైభవంగా గంగమ్మ జాతర

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలో గంగమ్మ జాతరను గ్రామ రైతు సంఘం, పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా జరిగింది. శనివారం అర్ధరాత్రి అనంతరం అమ్మవారిని కొలువుంచి పుష్పాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. వేకువజామునే భక్తులు అమ్మవారికి చీర, పసుపు, కుంకుమ, బోనాలు, నవధాన్యాలతో నైవేద్యంతో ఊరేగింపుగా తరలివెళ్లి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి అఖిలప్రియ, ఏవి సుబ్బారెడ్డి, ఇరిగెల రాంపుల్లారెడ్డి, తదితరులతో పాటు వివిధ గ్రామాల నుంచి వేల సంఖ్యలో భక్తులు గ్రామానికి చేరుకుని గంగమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ చాబోలు లక్ష్మిదేవి, నాయకులు కపురం శ్రీనివాసరెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి, మద్దూరు రామకృష్ణారెడ్డి తదితరులు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించారు. జాతర సందర్భంగా గంగమ్మ తల్లి విశిష్ఠత, గంగా కాటమరాజు కథను భక్తులకు వివరించారు. ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకటరామయ్య ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మహానందిలో భక్తుల రద్దీ

మహానంది: వేసవిసెలవులు, ఆదివారం, పెళ్లిళ్లు ఉండటంతో మహానంది ఆలయం భక్తజనంతో కళకళలాడింది. వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలిరవడంతో క్షేత్ర పరిసరాలు సందడిగా కనిపించాయి. ఉదయం అష్టవిధ మహామంగళ హారతుల సమయం నుంచి ప్రారంభమైన శ్రీ కామేశ్వరీ, మహానందీశ్వరస్వామి వార్ల దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది.

కోనేరుల్లో యువకుల అల్లరి

నంద్యాలకు చెందిన కొందరు యువకులు మహానంది కోనేరులో స్నానం చేస్తూ అల్లరి చేస్తున్న విషయాన్ని గమనించిన ఉద్యోగి నాగరాజు, మరికొందరు అల్లరి చేయొద్దంటూ సూచించేందుకు వెళ్లగా వాగ్వాదానికి దిగి దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, స్థానికులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.


మహానంది ఆలయ ప్రాంగణంలో భక్తులరద్దీ

మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణమాడ వీధిలోని నిత్యకళావేదికపై కువైట్‌కు చెందిన అనన్య సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. మహాగణపతిం, శివశంకర, నమఃశివాయతే, భో..శంభో, తదితర గీతాలకు నృత్యం చేశారు.


నృత్యం చేస్తున్న కళాకారిణి

శ్రీకృష్ణదేవరాయులుకు నివాళి

ఉయ్యాలవాడ : స్థానిక కమతం వీధిలో ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణ దేవరాయుల విగ్రహానికి బలిజ సంఘం నాయకులు ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్రభోజుడిగా పేరుగాంచి రాయలసీమ గొప్పతనాన్ని చాటిన ఆయన పాలన గురించి కాపు జేఏసీ చైర్మన్ దాసరి రాము, శాంతిరాముడు, హైకోర్టు న్యాయవాది గోగిశెటి నరసింహుడు, ఉమ్మడి కర్నూలు జిల్లా బలిజ సంఘం అధ్యక్షుడు ఎర్రమశెట్టి నారాయణరెడ్డి గుర్తు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బలిజలు రాజకీయంగా ఎదగాలి, ఐకమత్యంగా ఉండాలని సూచించారు. సంఘం మండల గౌరవ అధ్యక్షుడు వెంకటస్వామి, అధ్యక్షుడు ఆకుల వెంకటసుబ్బయ్య, కోశాధికారి అర్జిగారి నరసింహుడు పాల్గొన్నారు.


శ్రీకృష్ణ దేవరాయుల విగ్రహానికి నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు




ఆర్.జంబులదిన్నెలో అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు, రుద్రవరంలో పూజలు చేస్తున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో బైటిపేట ఆంజనేయస్వామి

నంద్యాల(వ్యవసాయం)/(అర్బన్): పట్టణంలోని పలు దేవాలయాల్లో ఆదివారం హనుమాన్ జయంతిని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకాలు, పూలంగిసేవ, ఆకుపూజ, సింధూరపూజ, వడమాల, అరటి పండ్లతో ప్రత్యేక అలంకరించి విశేష పూజలు జరిపించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని నంద్యాల పట్టణంలో భజరంగదళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక టెక్కె మార్కెట్‌యార్డు నుంచి వీరహనుమాన్ విజయయాత్ర నిర్వహించారు. విష్ణువర్ధన్‌రెడ్డి, పోలేపల్లిసందీప్,ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

- బైటిపేట అంజనేయస్వామి ఆలయంలో తెల్లవారుజామునే స్వామి వారికి పంచామృతాభిషేకాలు, పూలంగిసేవ, నిర్వహించి సింధూర అభిషేకం, తమలపాకులతో అర్చన, వడమాల, అరటి పండ్లతో అలంకరింపజేసి భక్తులను దర్శనానికి అనుమతించారు. సాయంత్రం ఉత్సవమూర్తిని పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. చైర్మన్ వెంకటేశ్వర్లు, ఈఓ ఆంజనేయశర్మ, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.
- సంజీవనగర్ రామాలయంలో స్వామి వారికి ఉదయమే క్షీరాభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణం, మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం దేవాలయం ఆవరణంలో పల్లకిసేవ జరిపించారు.
- టెక్కెలోని నాగులకట్ట గౌరీ సహిత స్ఫటిక లింగేశ్వర అభయాంజనేయస్వామికి మోహన్‌కుమార్, స్వర్ణలత దంపతులు వెండి తమలపాకుల తోరణాన్ని బహూకరించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.
- గోపాల్‌నగర్‌లో వెలసిన శ్రీవరసిద్ధి వినాయక అంభయాంజనేయస్వామి దేవాలయంలో స్వామి వారికి ఉదయం సామూహిక మంగళ హారతి, హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు.
- దేవనగర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయన్నే స్వామివారికి పంచామృతాభిషేకాలు,సింధూరఅభిషేకాలు,క్షీరాభిషేకం అనంతరం ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు.
- బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి నగరజోన సుధీర్ ఆధ్వర్యంలో 5వేల లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. బాలమురళీకృష్ణ, రేణుక, మల్లిక, ప్రశాంతి, రాజశేఖర్ పాల్గొన్నారు.
- ఆళ్లగడ్డ: హనుమాన్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ సమీపంలోనున్న అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేపట్టారు. అన్నదానం ఏర్పాటు చేశారు.
- ఉయ్యాలవాడ : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని ఆర్.జంబులదిన్నె, నర్సిపల్లె, ఉయ్యాలవాడ, తదితర గ్రామాల్లో వేడుకలను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ నర్సిపల్లె గ్రామ సమీపంలో వెలిసిన ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.
- రుద్రవరం: స్థానిక పడమటి వీధిలో వెలసిన ప్రతాప రుద్ర ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.వేద పండితులు ఉదయాన్నే స్వామి వారిని అభిషేకించి ఆకు తోరణాలు, ఫలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.స్థానికులతో పాటు చుట్టు పక్కల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. ఆళ్లగడ్డ వ్యవసాయమార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి పూజల్లో పాల్గొన్నారు.
- దొర్నిపాడు: మండలంలో హనుమాన్ జయంతిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. కొండాపురం, దొర్నిపాడు, క్రిష్టిపాడు తదితర గ్రామాల్లో హనుమంతునికి ఆకుపూజ, అభిషేకాలు నిర్వహించారు.


సంజీవనగర్ రామాలయంలోని అభయాంజనేయ స్వామి వారిని అరటి పండ్లతో అలంకరించిన దృశ్యం


టెక్కె నాగులకట్ట దేవాలయంలో ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

బిల్లుల మంజూరు

శిరివెళ్ల: గడప గడపకు మన ప్రభుత్వం పనులకు బిల్లులు మంజూరయ్యాయని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. మహదేవపురంలో నిర్మించిన మురుగు కాల్వల పనులకు రూ.10 లక్షలు, జీనేపల్లెలో రూ.4 లక్షల బిల్లులు ఆయా గ్రామాల కాంట్రాక్టర్ల బ్యాంక్ ఖాతాలో జమయయ్యాయని చెప్పారు. సిమెంట్ రోడ్ల పనుల బిల్లులు త్వరలో మంజూరవుతాయని పేర్కొన్నారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో కొలువైన మూల పెద్దమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టువస్త్రాలతో అలంకరించారు. భక్తులు అమ్మవారికి నూతన చీరలు, పిండివంటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా అందజేస్తున్నామని ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు సుద్దమల్ల, మాయలూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9:30 నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు, ఇంజేడు, కొండుపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అక్కంపల్లె ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

17న బహిరంగ వేలం

శిరివెళ్ల: యర్రగుంట్లలోని ఆలయాలకు చెందిన మాన్యం కౌలుకు ఈ నెల 17వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ నరసయ్య ఆదివారం తెలిపారు. రామస్వామి ఆలయానికి చెందిన 21.16 ఎకరాలు, ఈశ్వరస్వామి ఆలయం 22.24 ఎకరాలు, కేశవస్వామి ఆలయానికి చెందిన 25 ఎకరాల భూములు వేలం వేస్తామని చెప్పారు. ఆలయాలకు బకాయిలున్నవారు పాటలకు అనర్హులని పేర్కొన్నారు.